సాక్షి ఒడిశా
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.06.957లు, బంగారం 1.5 గ్రాములు, వెండి 49.3 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



సామాజిక చైతన్యానికి ఉత్సవాలు
- 8లో



గుంతలో పడి చిన్నారులు మృతి
- 8లో

న్యూస్‌రీల్

21నుంచి బడ్జెట్ సమావేశాలు

● 24న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశం

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 21నుంచి ప్రారంభమై, 2 విడతల్లో ఏప్రిల్ 6 వరకు కొనసాగనున్నాయి. సమావేశాలు పురస్కరించుకుని ఆర్థికమంత్రి నిరంజన్ పూజారి 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఈనెల 24న అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. 16వ శాసనసభలో ఇది 12వ విడత సమావేశం కాగా, రాష్ట్ర గవర్నర్ ప్రసంగంతో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. తొలివిడత ఈనెల 21 మార్చి 2వరకు, మలివిడతలో మార్చి 10 నుంచి ఏప్రిల్ 6వరకు జరగనున్నాయి. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున ఇదే చివరి పూర్తి బడ్జెట్‌గా భావిస్తున్నారు. దీంతో తాజా సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

16 నుంచి శివరాత్రి ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలోని పురాతన, చారిత్రాత్మక మహేంద్రగిరి పర్వతాలపై శివరాత్రి ఉత్సవం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన గురువారం సాయంత్రం అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, ఏడీఎం(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, ఐటీడీఏ పీఓ ఫాల్గుణీ మాఝి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్న శివరాత్రి జాతరకు యాత్రికులు చేరుకునేందుకు వీలుగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని, 24గంటల విద్యుత్ సరఫరా, తాగునీరు, సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఖుర్‌ఖాత్ పాస్ నుంచి మహేంద్రగిరికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనానికి రూ.50, ఆటోలకు రూ.100లు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.300లు రుసుంగా అటవీశాఖ సిబ్బంది వసూలు చేయాలని నిర్ణయించారు. 17న పర్వతాలపై మహాదీపం ఆవిష్కరించనున్న నేపథ్యంలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వైద్య సేవలు, అగ్నిమాపక దళం, పోలీసు రక్షణ కల్పించాలని వివరించారు.

ఒడిశా యాత్రికుడి అదృశ్యం

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల వెంకటేశ్వరుని దర్శనానికి వెళ్లిన యాత్రికుడి రాకకోసం కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. ఖుర్దా జిల్లా తొరొతువా జగులైపట్న గ్రామానికి చెందిన అనాథ్ స్వాయి(71) తిరమలేశుని దర్శనం కోసం జనవరి 31న తిరుపతి యాత్రకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 12864 యశ్వంత్‌పూర్–హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరగా, ఈనెల 1న ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్‌కు చేరాల్సింది. అయితే తోటి ప్రయాణికులతో రాత్రంతా కలిసి మెలిసి ప్రయాణించిన అతను.. ఉదయానికి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైలులో ప్రతి బోగీ గాలించిన ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఖుర్దారోడ్ గమ్యం చేరిన తరువాత స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీ)కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, మార్గం మధ్యలోని ఠాణాలకు సమాచారం అందించామని స్థానిక జీఆర్‌పీ అధికారి ధరణీధర ప్రధాన్ తెలిపారు. బూడిదరంగు ప్యాంటు, నీలిరంగు చొక్కా వేసుకున్న స్వాయి.. 5.7 అడుగుల ఎత్తు ఉన్నట్లు వివరించారు. ఆచూకీ తెలిసిన వారు సమీప జీఆర్‌పీ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



ఎమ్మెల్యే నారాయణరావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

పర్లాకిమిడి: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీనివాస, పద్మావతి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా జరిగాయి. ప్రముఖ వస్త్రవ్యాపారి బరాటం నాగేశ్వరరావు, సుశీల దంపతులు దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని జరిపించగా, ఆలయ ప్రధానార్చకులు భద్ర శ్రీనివాసాచార్యులు, భద్రం కృష్ణమోహనాచార్యులు, మహేంద్రడ వంశీ మనోహర్, చక్రధర్ పర్యవేక్షించారు. అంతకు ముందు స్వామివారికి పంచామృతాభిషేకాలు, గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం చేపట్టారు. శ్రీనివాస, పద్మావతి కల్యాణానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు హాజరై, వీక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

కలల సంతకం



ప్రిన్సిపాల్ గోపాల హల్దార్‌కు మిఠాయి తినిపిస్తున్న యువకుడు



స్వయంపాలిత జయపురం విక్రమ్‌దేవ్ కళాశాల

విద్యా ప్రగతిలో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డిమాండ్ నెరవేరింది. ఉమ్మడి కొరాపుట్ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల వేళ.. స్వయంపాలిత జయపురం విక్రమ్‌దేవ్ కళాశాలకు విశ్వ విద్యాలయంగా హోదా కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్వయంగా సీఎం నవీన్ పట్నాయక్ సంతకం చేయగా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై జిల్లా ప్రజలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

– జయపురం

● జయపురం వీడీ కళాశాలకు విశ్వవిద్యాలయ గుర్తింపు
● నోటిఫికేషన్‌పై సంతకం చేసిన సీఎం నవీన్ పట్నాయక్
● ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి
● హర్షం వ్యక్తం చేసిన కొరాపుట్ జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు

పట్టణంలోని స్వయంపాలిత విక్రమదేవ్ కళాశాలకు విశ్వవిద్యాలయంగా గుర్తిపు లభించింది. కళాశాల ప్రారంభమై 75 ఏళ్లు పూర్తి చేసుకొని, ప్లాటినమ్ జూబ్లీ జరుపుకొంటున్న సమయంలో యూనివర్సిటీగా సీఎం నవీన్ పట్నాయక్ ఆమోదం మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రధాన కార్యదర్శి బిష్ణుప్రసాద్ శెఠి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటి వరకు బరంపురం విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న విక్రమదేవ్ కళాశాల.. ఇకపై జయపురం విక్రమదేవ్ యూనివర్సిటీగా పిలువ బడుతుందని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. స్థానిక కళాశాల 1947లో ప్రారంభించబడింది. ప్రస్తుతం 16 పీజీ కోర్సులు, బీబీఏ, బీసీఏ, బీఈడీ తదితర సబ్జెక్టుల్లో బోధన అందిస్తున్నారు. అతిపురాతన విక్రమదేవ్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, ముఖ్యమంత్రి నవీన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉత్సవాల వేళ జిల్లా ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన కానుకగా దీనిని భావిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ హల్దార్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విద్యాలయం ఆవరణలో ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని, సంబరాలు జరుపుకొన్నారు.




యూనివర్సిటీగా ఆమోదిస్తూ సంతకం చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్

ట్రాఫిక్ నిబంధనలు..



జయపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జయపురం వీడీ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు శుక్రవారం రానున్న సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 10వేలకు పైగా ప్రజలు పాల్గొంటారని అంచనా వేయడంతో ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూట్ మ్యాప్ విడుదల చేశారు. పట్టణంలోని 10 ప్రాంతాల్లో హెవీ, 4 చక్రాలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ నియంత్రిస్తారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ అభినవ సోన్‌కర్, సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ పీసీ పర్యవేక్షించనున్నారు. జయపురం పట్టణ పోలీసు అధికారి సంజయ్‌కుమార్ బెహరా, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, ఇతర అధికారులు తమతమ సిబ్బందితో కలిసి ఏర్పాట్ల బాధ్యత వహిస్తారు.

పార్కింగ్ ఇలా..

బొరిగుమ్మ, కుంద్రా, కొట్‌పాడ్, జమితుల ప్రాంతాల నుంచి సీఎం సభకు వచ్చే ప్రజల వాహనాలు జిల్లా ఆస్పత్రి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఎస్‌సీసీ కార్యాలయం మైదానం, ప్రైవేట్ బస్టాండ్ ప్రాంతంలో నిలిపేందుకు ఏర్పాటు చేస్తున్నారు. జయపురం, బొయిపరిగుడ సమితుల నుంచి వచ్చే వారి కోసం జేఈఎల్‌సీ, ప్రభుత్వ నూతన బస్టాండ్, ట్రాఫిక్ సమీప టాక్సీ స్టాండ్ ప్రాంగణాల్లో, కొరాపుట్ సబ్ డివిజన్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు కొలాబ్ సాగునీటి కెనాల్ రోడ్డు, ఎక్బాగుడ గ్రామ సమీప మైదానం, కుంధారిగుడ, పారాబెడ, పాత బస్టాండ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు స్థలం కేటాయించారు.

నేతలతో కిక్కిరిసిన కొరాపుట్



కొరాపుట్: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ప్రణబ్ ప్రకాష్ దాస్‌తో బీజేడి మహిళా నేతలు

కొరాపుట్: సీఎం నవీన్ పట్నాయక్ శుక్రవారం జిల్లాకు రానున్నారని కొరాపుట్ కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని టౌన్ హాలు వద్ద మీడియాతో మాట్లాడారు. జయపురం విక్రమ్‌దేవ్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలలో పాల్గొనేందుకు రానున్న ముఖ్యమంత్రి.. దసరా పాడియా మైదానంలో మహిళా, శిశు సంక్షేమ పథకాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు కొరాపుట్‌కు ప్రముఖుల తాకిడి పెరిగింది. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సమావేశ మందిరంలో జిల్లా బీజూ జనతాదళ్ మహిళా, యువజన, విద్యార్థి విభాగాల సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణబ్ ప్రకాష్ దాస్ వారితో మాట్లాడారు. సమావేశంలో కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా మంత్రి రోహిత్ పూజారి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ప్రణబ్ ప్రకాష్ దాస్, జిల్లా పరిశీలకుడు కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రా, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభు జానీ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



ఆనందంతో సంబరాలు జరుపుకొంటున్న విద్యార్థులు

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



శివలింగపురం వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

● కొత్తవలస–కిరండూల్ మార్గంలో నిలిచిన రైల్వే సేవలు

కొరాపుట్/జయపురం:

జిల్లా సరిహద్దు శివలింగపురం సమీపంలో గూడ్స్ పట్టాలు తప్పింది. దీంతో కొత్తవలస–కిరండూల్ మార్గంలో రైల్వే సేవలు నిలిచిపోయాయి. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బచేలి నుంచి ఇనుప రజ లోడుతో గూడ్స్ రైలు వచ్చింది. కొరాపుట్ జిల్లా సరిహద్దు టన్నెల్ దాటిన వెంటనే 8 బోగీలు పట్టాలు తప్పాయి. దీని ప్రభావంతో విశాఖపట్నం–కిరండూల్(08551), విశాఖపట్నం–కిరండూల్(18513) ఎక్స్‌ప్రెస్, కిరండూల్–విశాఖపట్నం (18514) ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేసినట్లు వాల్తేర్ రైల్వే డివిజన్ అధికారులు ప్రకటించారు. కిరండూల్–విశాఖపట్నం(08552) రైలుని కొరాపుట్ వరకు నడిపి, వెనక్కి మళ్లించారు. ప్రమాదం జరిగిన వెంటనే బచేలి, కిరండూల్ ప్రాంతాల నుంచి కొరాపుట్ మీదుగా విశాఖపట్నం వెళ్లే ఇనుప రజ రవాణా తాత్కాలికంగా నిలిచిపోయింది.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



తహసీల్దార్ సీజ్ చేసిన ట్రాక్టర్

రాయగడ: నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను రాయగడ తహసీల్దార్ తపస్‌రౌత్ గురువారం సీజ్ చేశారు. స్థానిక రింగ్ రోడ్డు, కొత్తూరు ప్రాంతాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆయన ఆకస్మిక దాడులను నిర్వహించారు. ఈ క్రమంలో 3 ట్రాక్టర్లను తనిఖీ చేయగా, వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయా యజమానులకు రూ.10 వేల చొప్పున్న జరిమాన విధించారు. అనుమతులు లేకుండా అక్రమంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించంచారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగే రవాణాపై తమకు సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు.

కృష్ణసారం.. @ 4939



కళ్లికోట్ రేంజ్‌లో పంట పొలాల్లో నీటి కోసం సంచరిస్తున్న వన్యప్రాణులు



రంబా సుబలియా ప్రాంతంలో సేదతీరుతున్న కృష్ణసార జింకలు

బరంపురం: పర్యాటకులు, వన్యప్రాణి ప్రియులకు అటవీశాఖ అధికారులు తీపి కబురు అందజేశారు. గంజాం జిల్లాలోని దక్షిణ ఘుమసురా అటవీ ప్రాంతంలో కృష్ణసార జింకల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు గురువారం ప్రకటన విడులు చేశారు. జిల్లా అటవీశాఖ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణసార జింకల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేవారు. దీనిపై ఫారెస్ట్ అధికారి ఆశిష్ కుమార్ బెహరా తెలిపిన వివరాల ప్రకారం కళ్లికోట్, బరంపురం రేంజ్, ఘుమసుర డివిజన్ల పరిధిలో 4,939 జింకలు ఉన్నట్లు వెల్లడించారు. 18 ఏళ్ల క్రితం బల్లిగుడా రేంజ్‌లో కేవలం 26జింకలు మాత్రమే ఉండగా.. ఏటా వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2013లో వచ్చిన ఫైలిన్, 2018లో తిత్లీ తుఫాన్ల ధాటికి వందలాది వన్యప్రాణులు మతి చెందాయి. అయితే క్రమంగా వాటి సంఖ్య పుంజుకొని, 4,939కి చేరాయని ప్రకటించారు. మరోవైపు వేసవికాలం రాకముందే నీటి ఎద్దడి తీవ్రం కావడంతో జీవులు దాహంతో తహతహ లాడుతున్నారు. నీటి జాడ కోసం అన్వేషిస్తూ కోసం చుట్టపక్కల గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. దీనిని గుర్తించి, సంరక్షణపై అన్ని విధాల చర్యలు తీసుకోనున్నట్లు డీఎఫ్‌ఓ బెహరా వివరించారు.

క్లుప్తంగా

డీలర్ నిర్వాకం



పలగర ఒకటవ నంబర్ డిపో వద్ద ఉన్న చంద్రన్న విలేజ్ మాల్ బోర్డు

బలిజిపేట: ప్రభుత్వం మారింది..అన్ని కార్యాలయాల వద్ద గతంలో ఉండే బోర్డులు మారాయి. మండలంలోని పలగరలో ఒకటవ నంబర్ రేషన్ డిపో వద్ద మాత్రం చంద్రన్న విలేజ్ మాల్ బోర్డునే డీలర్ కొనసాగించడం విశేషం. బోర్డును చూసేవారు ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారు. ఈ డిపోవద్దకు అధికారులు పర్యవేక్షణ నిమిత్తం పలు పర్యాయాలు వచ్చినప్పటికీ లోపల ఏముందో పరిశీలించారు తప్ప షాపువద్ద బోర్డు ఎందుకు ఇలా ఉందో పరిశీలించకపోవడం గమనార్హం. డీలర్ వీరాభిమానంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిని గమనిస్తే మంచిదని భావిస్తున్నారు.

30 ట్రాక్టర్ల ఇసుక సీజ్



ఎస్సై భాగ్యం సీజ్ చేసిన అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

దత్తిరాజేరు: మండలంలోని చినకాద పంచాయతీ మధుర గ్రామమైన రాజుపేట సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుక సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై బి భాగ్యం గురువారం తెలిపారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఏడొంపుల గెడ్డ నుంచి ఇసుక తరలించి తోటలో నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి వీఆర్వో సత్యవతికి అప్పగించినట్లు తెలిపారు. ఈ అక్రమ చర్యలకు కారణం ఎవరన్నది తెలియాల్సి ఉందని ఎస్సై అన్నారు.

160 లీటర్ల సారా పట్టివేత

- ఆటో, ద్విచక్రవాహనం సీజ్
- ఇద్దరిపై కేసు నమోదు



సారా స్వాధీనం చేసుకున్న పోలీసులు

సీతంపేట: సారా అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మండలంలోని వలగజ్జి సమీపంలో సీతంపేట పోలీసులు గురువారం పట్టుకున్నారు. పాలకొండ మండలం వోని గ్రామానికి చెందిన కె.శ్రీను, కె.ప్రవీణ్‌లు ఆటో, ద్విచక్రవాహనాలతో క్యాన్లలో 160 లీటర్ల సారా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. వాహనాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సారా వండినా, అక్రమరవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏనుగు దాడిలో ఆవుదూడ మృతి



దళాయిపేట గ్రామంలో ఏనుగు దాడి చేయడంతో మృతిచెందిన ఆవుదూడ

కొమరాడ: మండలంలోని దళాయిపేట గ్రామ పరిసరాల్లో గురువారం ఉదయం ఆవుదూడపై ఒంటరి ఏనుగు దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆవు దూడ అక్కడికక్కడే మృతిచెందిదని పాడి రైతు మంతిన కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఏనుగుల వల్ల పంటలు, మనుషులతో పాటు పెంచుకున్న పాడి పశువులను కూడా పోగొట్టుకోవాల్సివస్తోందని బాధితుడితో పాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల ఫారం దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో గ్రామానికి చెందిన గుంట్రెడ్డి సురేష్ కోళ్లఫారంలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కోళ్ల ఫారంలో షెడ్‌తో పాటు కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయాన్ని పార్వతీపురం అగ్నిమాపకశాఖ సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. జీవనోపాధికోసం అప్పుచేసి కోళ్ల వ్యాపారం చేస్తే ఇలా జరగడంతో ఎలా జీవించాలని సురేష్ కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు పరిశీలించి తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

సామాజిక చైతన్యానికి ఉత్సవాలు

- ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక
- ముగిసిన వంశధార వసంతోత్సవాలు



వంశధార సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యేలు, అధికారులు



మంత్రి జగన్నాథ సరకను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రాయగడ:

ఆదివాసీ భాషా, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా నిర్వహించిన వంశధార వసంతోత్సవాలు ప్రజల్లో సామాజిక చైతన్యం సృష్టించాయని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో జనవరి 28నుంచి కొనసాగుతున్న వంశధార వసంతోత్సవాలు బుధవారం రాత్రి అధికారికంగా ముగిసాయి. మంత్రి సరక ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఉత్సవాలను పురస్కరించుకుని మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రదర్శనలు ప్రజలకు ఎంతో నేర్పాయన్నారు. గుణుపూర్ పరిసర ప్రాంతాల్లోని డొంగ్రియా, లంజియా సవర తెగలకు చెందిన ఆదివాసీలు ఈ ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో రావడం కనిపించిందని తెలిపారు. కొండ కోనల్లో నివసించే వీరంతా ఇదే పెద్ద పండగగా ఆనందించారని పేర్కొన్నారు. ఇటువంటి ఉత్సవాలను జరుపుకోవడంతో వారిలో సామాజిక స్పృహ మెరుగు పడుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వారి సంక్షేమ కోసం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సావనీర్ ఆవిష్కరణ..

వంశధార వసంతోత్సవాల్లో భాగంగా స్థానిక రచయితలు, కవులు రూపొందించిన వంశధార సావనీర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి సరక, బిజూ స్వాస్థ్య సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్‌దాస్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, గుణుపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మానంద పట్నాయక్, పృథ్వీరాజ్ సాహు, నవనిర్మాత సమితి అధ్యక్షుడు అక్షయ్‌కుమార్ దాస్, ఉత్సవ కమిటీ ప్రతినిధి మిలీ పాఢి తదితరులులు పాల్గొన్నారు.

అలరించిన కార్యక్రమాలు..

ఈ ఉత్సవాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీల్లో ఆనందం వెల్లివిరిసిందని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ అన్నారు. గుణుపూర్‌లో జీవనదిగా పేరొందిన వంశధార పేరిట ఏటా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ఇకపై మరింత ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. రోజూ ఉత్సవాల్లో భాగంగా కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమన్నారు. వినోదాల కోసమే కాకుండా మన భాష, సంస్కృతిని పరిరక్షించేందుకు కూడా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అలాగే ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో జబర్దస్త్ నటులు వెంకీ, మంకీ బృందానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన హాస్యపు జల్లులు ప్రేక్షకులను ఆనందింపజేశాయి. భువనేశ్వర్‌కు చెందిన చిన్నారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మరో 2 రోజులు..

రోజూ వేలాది సంఖ్యలో ఉత్సవాలను తిలకించేందుకు వస్తున్న ప్రజల కోరిక మేరకు ఉత్సవాలను మరో 2 రోజుల పొడిగించారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ వేదికపై ప్రకటించారు. స్టాల్స్, దుకాణాలు కూడా కొనసాగుతాయని, అయితే ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవని స్పష్టం చేశారు.



ఉత్సవాల్లో నవ్వులు పూయిస్తున్న జబర్దస్త్ నటులు



ఆకట్టుకున్న విద్యార్థుల ఒడిస్సీ నృత్యం

ధార్మిక కార్యక్రమాలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి, కమిటీ ప్రతినిధులు

- 4న జయపురానికి పూరీ మఠం పీఠాధిపతి నిశ్చలానంద రాక
- భక్తులు తరలి రావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: పూరీ శంకరాచార్య మఠం పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతి ఈనెల 4న స్థానిక పట్టణానికి రానున్నట్లు జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న పలు ధార్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్వాగత కమిటీ తరపున పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని సంధ్యా ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూరీ పీఠాధిపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మీడియా ప్రధాన భూమిక పోషించాలని కోరారు. ఈనెల 3న రాయగడ జిల్లా మునిగుడ పాయికసాహి లోని లక్ష్మీపూజ మైదానంలో జరిగే హిందూరాష్ట్ర ధర్మసభలో స్వామి నిశ్చలానంద పాల్గొన్నట్లు తెలిపారు. అక్కడి నుంచి 4న మునిగుచి నుండి శమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి జయపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ అపూర్వ స్వాగతం పలికేందుకు భక్తులు తరలి రావాలని పేర్కన్నారు. రాత్రికి జయపురం అన్నపూర్ణ నగర్‌లో నర్సింగ పండా నివాసలో విశ్రాంతి తీసుకొని, 5న ఉదయం 11.30 గంటల నుంచి 2గంటల వరకు దసరా పొడియా మైదానంలో జరగనున్న హిందూ రాష్ట్ర ధర్మసభలో ప్రసంగించనున్నట్లు ప్రకటించారు. సాయంత్రం భక్తులకు దర్శనభాగ్యం, 6న జయపురం నుంచి బయలుదేరి బొరిగుమ్మ మీదుగా జగదల్‌పూర్‌కు పయనమవ్వనున్నారని వివరించారు. వీటిని భక్తులు, ప్రజలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కమిటీ మీడియా ప్రతినిధి పరేష్ రథ్, కమిటీ అధ్యక్షుడు ప్రకాష్‌కుమార్ నాయక్, కార్యదర్శి నరేష్ మఠబూనియ, ప్రశాంత్ శత్పతి తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు, కర్ణాటక దంపతులకు బాలికల దత్తత



బాలికను తమిళనాడుకు చెందిన దంపతులకు అప్పగిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రంలోని నిస్సాన్ సలోమ్ పోష్య సంతాన కేంద్రానికి చెందిన ఇద్దరు బాలికలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దంపతులకు కలెక్టర్ లింగరాజ్ పండా సమక్షంలో గురువారం అప్పగించారు. ఇద్దరిలో ఒకరికి ఐదేళ్లు, మరొకరు 5నెలల పసికందు కావడం గమనార్హం. పశ్చిమబెంగాల్ లోని మిద్నాపూర్‌లో తల్లిదండ్రులు వదిలివేసిన వీరికి పర్లాకిమిడి సలోమ్ పోష్య కేంద్రంలో పునరావాసం కల్పించారు. ఇరువురికీ సంతానం లేని దంపతులు దత్తత తీసుకోవడంపై కలెక్టర్ పండా సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేటు సంగ్రాంశేఖర పండా, డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు జిల్లా నుంచి 36మంది శిశువులను వేర్వేరు ప్రాంతాలు, దేశాలకు అప్పగించారు.

గ్రామ న్యాయస్థానం ప్రారంభం



గ్రామ న్యాయస్థానాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితిలో తొలిసారిగా గ్రామా న్యాయస్థానం వ్యవస్థను ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎస్.మురళీధర్ వర్చువల్ మాధ్యమంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ సమితి ప్రజలు తమకు ఎటువంటి కష్టం వచ్చినా ఇకపై గ్రామ కోర్టులోనే న్యాయం పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని మత్తిలి, కుడుములగుమ్మ, ఎంవీ 79 ప్రాంతాల్లో ఈ తరహా న్యాయస్థానాలు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై అన్ని సమితుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి న్యాయమూర్తి అజాంత సాడంగా, జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ, అదనపు కలెక్టర్ మహేశ్వర్‌చంద్ర నాయక్, మల్కన్‌గిరి అదనపు న్యాయమూర్తి ఉదయ్ భాను జెనా, కోరుకొండ గ్రామ న్యాయస్థానం న్యాయమూర్తి దేవేంద్రనాథ్ భాగ్, మల్కన్‌గిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ మహంతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి అమ్మకందారుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో యువకులకు చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని ప్యాకింగ్‌లు చేసి కళాశాల విద్యార్థులు, యువకులకు అమ్మకాలు చేస్తున్న రుక్మిణి, షేక్ ఖురేషి అనే మహిళలతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు ఘఢ్‌కి చెందిన శేఖర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి 300 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి సహకరించండి



పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులపై దేవదాయశాఖ కమిషనర్‌తో చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్‌ను శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. గొల్లపూడిలోని కమిషనర్ కార్యాలయంలో గురువారం కలిశారు. నూతన భవన నిర్మాణంలో అన్నదాన మండపం, హోమశాల, క్యూ కాంప్లెక్స్ తదితర ఆలయ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, పనులు పూర్తిచేయడంపై చర్చించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఎంకేబీ శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం అందించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానం బోధించేందుకు పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల (పరిశోధనాలయాలు)ను విజయవంతంగా నిర్వహించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక పోర్ట్‌సిటీ స్కూల్‌లో గురువారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెలా ఒక రోజు వర్క్‌షాపు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు వి.రమేష్, జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

విజయనగరం బాబామెట్టలోని బాలికల ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

గుంతలో పడి చిన్నారులు మృతి



చిన్నారులు పడిపోయిన గుంత



చిత్రకొండ ఆస్పత్రిలో చిన్నారుల మృతదేహాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో కేంద్రం దేఫ్‌సాహిలో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ప్రమాదావశాతు ఓ నీటి గుంతలో జారిపడి మృతిచెందారు. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దేఫ్ సాహికి చెందిన సుభద్రా కమార్(4), సుమీ జానమ్(3) తమ ఇంటి పెరట్లో ఆడుకుంటున్నారు. అయితే అకస్మాతుగా వారి ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఇంటి వెనుక భాగంలోని నీటి గుంత నుంచి బుడగలు రావడంతో వెంటనే అందులో వెతికగా, చిన్నారులిద్దరూ కనిపించారు. వెంటనే గ్రామస్తుల సాయంతో చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. రోడ్డు నిర్మాణం నిమిత్తం గుంతులు తవ్వి, వదిలేశారని, దీని వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు మండిపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తల్లిదండ్రులకు అప్పగిస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి

- డీఎస్పీ ఎ. సుభాష్



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ ఎ.సుభాష్

పార్వతీపురం టౌన్: విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తిచూపి భవిష్యత్‌లో మంచి స్థానానికి చేరుకోవాలని డీఎస్పీ ఎ.సుభాష్ పిలుపునిచ్చారు. రాష్ట్రస్థాయి తైక్వాండోపోటీల్లో పతకాలను సాధించిన అనిల్ శర్మ అకాడమీ విద్యార్థులను గురువారం తన క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో మంచి పతకాలను సాధించి పార్వతీపురం మన్యం జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. 64కేజీల విభాగంలో ఎస్.జతీష్, బి. దేవేష్‌లు బంగారు పతకాలు, సీహెచ్ అనంత్ 55కేజీల విభాగంలో వెండి పతకం, బాలికల విభాగంలో హర్షితశర్మ వెండిపతకం సాధించడం ఆనందంగా ఉందని ప్రశంసించారు. ఈ నెల 3,4,5 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జాతీయస్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనిల్‌శర్మ, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లోనే ఆరోగ్యమిత్ర మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య వెంకటలక్ష్మి

భామిని: మండలంలోని ఏటంగూడకు చెందిన గిరిజన యువకుడు, ఆరోగ్యమిత్ర బిడ్డిక వెంకటరమణ(46) గురువారం సీతంపేట ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ అకస్మికంగా మృతి చెందాడని మృతుని భార్య బిడ్డిక వెంకట లక్ష్మి విలపిస్తూ తెలిపింది.సీతంపేట సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రగా విదులు నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడని, వెనువెంటనే వైద్య సేవలు అందిస్తుండగా మృత్యువాత పడినట్లు చెప్పింది. ఆరోగ్య శ్రీ పథకం అమలవుతున్న నాటి నుంచి సీతంపేట, కొత్తూరు, భామిని ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న బిడ్డిక వెంకటరమణ(46)మృతిని వైద్య సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మితో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దాసరి సూరప్పుడు (ఫైల్)

గుర్ల: మండలంలోని పల్లి గండ్రేడు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్ల మండలం గోషాడ గ్రామానికి చెందిన దాసరి సూరప్పుడు(30) మృతిచెందాడు. సూరప్పుడు పల్లిగండ్రేడులోని అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పల్లిగండ్రేడు జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడ్డాడు. ప్రమాదంలో సూరప్పుడు అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్సై జి.శిరీష్ చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష పేర్కొన్నారు.

కాలు జారిపడి మరొకరు..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని పాత గరివిడి ప్రాంతంలో అక్కివరపు ఆదినారాయణ(48) అనే వ్యక్తి కాలు జారి పడిపోయి సంఘటనలో మృతిచెందినట్లు ఎస్సై బి.మురళి తెలిపారు. మృతుని సోదరుడు అక్కివరపు రాజు ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ నాలుగేళ్లుగా పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఎడమ కాలు, ఎడమ చెయ్యి చచ్చుబడి ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లోనే కాలు జారి టీపాయి మీద పడిపోవడంతో టీపాయి గాజు పెంకు గొంతులో గుచ్చుకుని విపరీతమైన రక్త స్రావం జరిగింది. వెంటనే చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని ఎన్‌టీఆర్‌సీఎస్‌డీ (మహిళా ప్రాంగణం)లో నాలుగు నెలల పాటు నిర్వహించనున్న రెసిడెన్సియల్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ పి.విమల చెప్పారు. కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్లు 76800 29059, 90100 74289 సంప్రదించాలని అన్నారు.

‘ప్రిస్క్రిప్షన్ లేనిదే పెయిన్ కిల్లర్స్ ఇవ్వవద్దు’



జాడుపూడి మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్షన్ అధికారులు

కంచిలి: వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేనిదే పెయిన్ కిల్లర్స్ ఇవ్వవద్దని మెడికల్ షాపుల నిర్వాహకులకు టెక్కలి డివిజన్ పరిధి డ్రగ్స్ ఏడీ ఎం.చంద్రరావు స్పష్టం చేశారు. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, జాడుపూడి, కవిటి, పలాస, కాశీబుగ్గ ప్రాంతాల్లో గల మెడికల్ దుకాణాల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో పెయిన్ కిల్లర్స్ నిల్వల వివరాలను నమోదు చేసుకొన్నారు. కిడ్నీ వ్యాధి విస్తరించడానికి పెయిన్ కిల్లర్స్ అధిక వాడకం కూడా ఓ కారణంగా భావించి, వీటి వినియోగం విచ్చలవిడిగా ఉండకూడదని ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెరైన్ పోలీసుల ఆధీనంలో మిలటరీ డ్రోన్



నౌపడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన మిలటరీ డ్రోన్

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడు తీరంలో బుధవారం మత్స్యకారులకు దొరికిన మిలటరీ డ్రోన్‌ను భావనపాడు మెరైన్ సీఐ దేవుళ్లు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా గోపాల్‌పూర్‌లో జనవరి 27న యూజర్ ట్రైల్‌లో భాగంగా పైలెట్ ఎయిర్‌క్రాఫ్ట్ మిషన్ నుంచి ఈ డ్రోన్‌ను కొట్టడానికి నమూనాగా తయారు చేశామని, దీన్ని ప్రయోగించినట్లు బన్‌సీ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ డ్రోన్‌ను 45 నిమిషాల్లో వైమానికి వాహనం ద్వారా ధ్వంసం చేయాలని, ఆ సమయంలో డ్రోన్‌లో ఇంధనం అయిపోవడంతో సముద్రంలో పడిపోయి భావనపాడు తీరానికి చేరిందని కంపెనీ ప్రతినిధులు నౌపడ పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. వీటిని అప్పగించాలని బన్‌సీ కంపెనీ ప్రతినిధులు కోరగా డీఆర్‌డీఏ అధికారుల సమక్షంలో అందజేస్తామని తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్ జగన్ సర్కారు ధ్యేయమని మెప్మా రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి వెల్లడించారు. రైతు బజారు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న మహిళామార్ట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. స్థిరమైన ఆస్తిని మహిళా సంఘాలకు ఏర్పాటుచేసేందుకు 18,278 మహిళా సంఘ సభ్యులు ఒక్కొక్కరు రూ.150లు చొప్పున రూ.27.42లక్షలు వాటా ధనంగా పెట్టుబడి పెట్టి జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం మెప్మా పీడి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, పి.సుగుణారెడ్డి, చల్ల అలివేలుమంగ, ఎంఈ గంగాధర్, డీఈ రమణమూర్తి, పైడి మహేశ్వరరావు, కర్నేన పద్మావతి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై లైంగిక వేధింపుల కేసు

సోంపేట: సోంపేట తహసీల్దార్ ఎన్.రమేష్‌పై లైంగిక వేధింపుల కేసు గురువారం నమోదు చేసినట్లు సోంపేట ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోంపేట పంచాయతీ మొగిలి కొత్తూరుకు చెందిన మీసాల ఉషారాణికి సోంపేటలో స్థలం ఉంది. స్థలానికి అడంగల్ కాపీలు రాకపోవడంతో ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ తహసీల్దార్‌ను కలవమని సూచించగా.. ఆమె రమేష్‌ను కలిసి సమస్య విన్నవించారు. అయితే స్థలం సమస్య పరిష్కరించడానికి తహసీల్దార్ లైంగికంగా వేధింపులకు గురి చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె చేసిన ఫిర్యాదు మేరకు సోంపేట ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదుచేశారు.

• గేటు వద్ద ఫీట్లు









కాశీబుగ్గ ఎల్‌సీ రైల్వే గేటు వద్ద కొందరు వాహనదారులు ప్రమాదకర ఫీట్లు చేస్తున్నారు. ఇక్కడ గేటు పడే వేళకు ఎలాగైనా దాటేయాలనే అత్యుత్సాహంలో గేటు కిందకు దూరి వెళ్లడం, గేటు వేస్తుండగా మధ్యలోకి వెళ్లిపోవడం వంటి పనులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా బైక్‌లపై వచ్చే వాళ్లతోనే ఈ ఇబ్బంది ఎదురవుతోందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు.

– కాశీబుగ్గ

భూదేవి ఒడిలో ధాన్యలక్ష్మి



ఇళ్ల ముందు ధాన్యం పాతర్లు

- పుడమి ఒడిలో ధాన్యం భద్రం
- సరిహద్దులో ఇప్పటికీ పాతరలోనే ధాన్యం నిల్వ

ఊరి దారులు రహస్యంగా దాచుకున్న కథలు కోకొల్లలు. నల్లటి తారు కప్పుకున్న రోడ్లు, తెల్లటి సిమెంటు రంగేసుకున్న బాటలు.. నిజానికి రహదారులు మాత్రమే కావు.. వేల జ్ఞాపకాలకు ద్వారాలు. పల్లెల్లో మట్టి రోడ్ల రోజులు గతించిపోతూ కొన్ని అలవాట్లను తమతో ఉంచేసుకున్నాయి. అలా నిన్నటి కాలం తనతో ఉంచేసుకున్న కథ ‘పాతర’. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆరు కాలాల పాటు నిల్వ ఉంచడానికి భూమి కడుపును ఆశ్రయించిన అన్నదాతల తెలివికి ప్రతీక ఇది. ధాన్యలక్ష్మి బాధ్యతను భూదేవికే అప్పగించారు. ఇచ్ఛాపురంలోని సరిహద్దు గ్రామాల్లో అక్కడక్కడా ఈ పాతర్లు ఇంకా దర్శనమిస్తున్నాయి. ధాన్యం నిల్వ ఉంచడానికి ఈరోజు అనేక పద్ధతులు ఉండవచ్చు. కానీ సాంకేతికత అనేదే లేని రోజుల్లో నెలల తరబడి ధాన్యం నిల్వ చేయడానికి మన పూర్వీకులు కనిపెట్టిన ఈ విధానం వారి విజ్ఞానానికి ఓ నిదర్శనం.

ఇచ్ఛాపురం రూరల్: పల్లె ఒడిలో పెరిగి పెద్దయిన వారికి.. గ్రామాల్లో బాల్యం గడిపిన వారికి పాతర్లు పరిచయమే. కానీ పట్టణీకరణ పెరిగి మట్టికి దూరమైపోతున్న ఈ తరానికి మాత్రం పాతర గురించి కచ్చితంగా తెలియాలి. పాతర వేయడం అంటే భూమిలో గొయ్యి తీసి దాచిపెట్టడం. ఒకప్పుడు ధాన్యం నిల్వ ఉంచడానికి ఎలాంటి సాధనం లేని రోజుల్లో భూమిలో ధాన్యం ఉంచే పద్ధతిని మన పూర్వీకులు అనుసరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పల్లెల్లో ఇప్పటికీ ఇవి కనిపిస్తున్నాయి.

అంత సులభం కాదు..



పాతర వేసే ముందు ధాన్యం రాశికి పూజలు

ఈ ధాన్యాన్ని పాతర వేయడం అంటే అనుకున్నంత సులువేం కాదు. పాతర వేయడానికి రైతుల ఇళ్ల ముందు వీధిలో ఉండే ఖాళీ స్థలాన్ని ఎంచుకొని వృత్తాకారంలో, దీర్ఘ చతురస్త్రాకారంలో నిల్వ చేయాల్సిన ధాన్యం రాశి పరిమాణానికి తగినట్లుగా గోతిని తవ్వుతారు. గోతిని కనీసం ఆరు అడుగుల లోతులో తవ్వడం పూర్తయ్యాక, వరి నూర్పులు సమయంలో వచ్చిన ఎండు గడ్డిని జడలా అల్లుతూ ‘బెంటు’ను తయారు చేస్తారు. దాన్ని గోతిలో పేర్చి, అడుగు భాగంలో కొంటి గడ్డిని పొరలు పొరలుగా అమర్చుతారు. భారీ వర్షాలు కురిసినా నీరు గోతిలో చేరకుండా చాకచక్యంగా పై వరకు అమర్చుతారు. అందులో టార్పాలిన్లు గానీ, వలను గానీ వేసి ధాన్యంను వేస్తారు. అనంతరం ధాన్యంపై ఎండు గడ్డిని వేసి, దానిపై మట్టితో కప్పి ఆవు పేడతో శుభ్రంగా అలుకుతారు.



ధాన్యం నిల్వ కోసం తీసిన పాతర గొయ్యి



పాతరలో వల వేసి ధాన్యం వేస్తున్న రైతులు



మండపల్లి ప్రాంతంలో ఇళ్ల ముందు ధాన్యం పాతర్లు

రక్షణ కోసం..

ఒక్కసారి పాతర వేశాక.. ధాన్యం పోతుందన్న దిగులు రైతులకు ఇక ఉండదు. వానలు, దొంగలు, అగ్ని ప్రమాదాలు ఇలా ఏ వైపరీత్యం వచ్చినా పాతరే పంటను కాపాడుకుంటుంది. చాలా ఇళ్లలో ఈ పాతర్లకు ప్రతి గురువారం ప్రత్యేక పూజలు కూడా చేసేవారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా పేడతో అలికి ముగ్గులు పెట్టి మురిపెంగా చూసుకునేవారు. బియ్యం కావాల్సిన సమయంలో తీసి మిల్లు చేసుకోవడమో దంచుకోవడమో చేసుకునేవారు. పాతర ధాన్యం తిన్న పాపలు పుష్టిగా ఉంటారని గ్రామీణ ప్రాంతాల్లో నానుడి ఉంది. పూర్వం గ్రామాల్లో ఉండే భూస్వాములు రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించేవారు. పంట దిగుబడి తనకే అధికంగా వచ్చిందనడానికి ప్రతీకగా తమ ఇళ్ల ముందు పాతర్ల రూపంలో తోటి రైతులకు తెలియజెప్పేందుకు వేసేవారని చెబుతారు.

పుష్కలంగా పోషకాలు..



పాతర్లలో నిల్వ చేసిన ధాన్యంలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. ధాన్యం పరిమాణంలో కూడా తేడా వస్తుంది. నెలల తరబడి పాతర్లలో నెలలు తరబడి ఉండటంతో ధాన్యం భూగర్భంలో బాగా ముక్కుతాయి. ఇలాం ధాన్యం మిల్లులో వేసి బియ్యం చేయడం కన్నా, ఎండలో వేసి రోట్లో వేసి దంచిన తర్వాత వచ్చిన బియ్యాన్ని ఉపయోగిస్తే మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. బియ్యంతో తయారైన ఆహారం తినడం వల్ల రక్తహీనత సమస్యలు దరికి చేరవు. ఇచ్ఛాపురం మండలంలో చాలా గ్రామాల్లో పాతర్ల పద్ధతిని కొనసాగిస్తుండటం గమనార్హం.

– పిరియా శ్రీదేవి, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం మండలం

ఇప్పటికీ పాతరే..



గ్రామంలో సిమ్మెంట్ రోడ్లు వచ్చినా.. తరతరాలుగా వస్తున్న పాతర సంప్రదాయాన్ని ఇప్పటికీ మేము కొనసాగిస్తూనే వస్తున్నాం. రైతుల ఇళ్ల ముందు వేసిన పాతర ఎంత ఎత్తులో ఉంటే యజమాని ఎన్ని ఎకరాల భూస్వామిగా అప్పట్లో నిర్ధారించేవారు. అప్పట్లో రైతుకు మానసికంగా ఎన్ని కష్టాలు వచ్చినా, ఈ ధాన్యం పాతర చేసి కష్టాలను మరచిపోయేవారు. దొంగల భయం నుంచి, అగ్ని భయం నుంచి సురక్షితంగా ధాన్యం సంరక్షించుకునేందుకు చక్కని అవకాశం ఈ పాతర్లు.

– కొణతాల కనకయ్య, రైతు, తేలుకుంచి, ఇచ్ఛాపురం మండలం

శాలిహుండం యాత్ర ఆదాయం రూ. 7,79,248



భీష్మ ఏకాదశిన జరిగిన శాలిహుండం గిరి యాత్ర హుండీల ఆదాయం రూ.7,79,248లు వచ్చిందని ఆలయ ట్రస్టీ సుగ్గు మధు రెడ్డి తెలిపారు. దేవదాయ శాఖాధికారులు కోదండ, శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, రామచంద్ర రావుల సమక్షంలో హుండీలను తెరచి లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాలచార్యులు, అచ్యుతరావు, తాన్నె రాజారావు. గురయ్య పాల్గొన్నారు.

– గార

అనకాపల్లి టు కాశీ



అనకాపల్లి నుంచి కాశీ వెళ్లేందుకు నలుగురు భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. వీరు గురువారం కవిటి మండలంలో స్థానికులతో ముచ్చటించారు. లక్ష్మణమూర్తి, దొంతికుర్తి స్వర్ణనాగేశ్వరరావు, వంకలంక శేషగిరిరావు, బొలిశెట్టి కొండగబాబు అనే నలుగురు భక్తులు ఈ పాదయాత్ర చేస్తున్నారు. ప్రతి రోజు వేకువజామున నాలుగు నుంచి పదిగంటల వరకు పదిహేను కిలోమీటర్లు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు పది కిలోమీటర్లు నడుస్తున్నామని తెలిపారు. శుక్రవారం నుంచి ఒడిశాలో నడక ప్రారంభం కానుందన్నారు.

–కవిటి

రారండోయ్ వేడుక చూద్దాం

- రేపటి నుంచి వత్సవలస జాతర
- నాలుగు వారాల పాటు జరగనున్న రాజమ్మతల్లి పండగ
- వన్‌వే ఏర్పాటుపై ప్రకటించిన పోలీసులు

గార: జాము రాతిరి ప్రయాణం, వెన్నెల్లో జాగారం, వేకువల్లో సముద్ర స్నానం, వైభవంగా తల్లి దర్శనం .. వెరసి వత్సవలస జాతర. గార మండలంలోని వత్సవలస గ్రామ దేవత శ్రీరాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) జాతర శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. లక్షలాది మంది యాత్రికులు వచ్చే ఈ జాతర నాలుగు వారాల పాటు జరుగుతుంది. దేవదాయ శాఖ గుర్తింపు లేకపోయినా భారీగా జనాలు వచ్చే అవకాశం ఉండడంతో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, చుట్టు పక్కల గ్రామాల్లో ఇంటి దేవత రాజమ్మ తల్లి. భక్తులు తమ తొలి సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటారు. వంశోద్ధారకుల తల వెంట్రుక (పుట్టుకొప్పు)లను ఇక్కడ అమ్మవారికి సమర్పిస్తుంటారు. శనివారం సాయంత్రం ఇక్కడికి విచ్చేసి ఆదివారం ఉదయం అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తన వెంట తీసుకువచ్చిన కోళ్లు, గొర్రెలను సమర్పిస్తుంటారు. అనంతరం ఇక్కడే వంటలు చేసుకుని విందు ఆరగించి తిరిగి ఇంటి ముఖం పట్టడంతో జాతర ముగుస్తుంది.

150 మంది పోలీస్‌తో పటిష్ట బందోబస్తు

యాత్రకు తొలివారం 150 మందితో పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నా మని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపారు. యాత్రకు సంబంధించిన ఏర్పా ట్లను ఆయన పర్యవేక్షించారు.

ఎస్పీ ఆదేశాలతో వన్‌వే, వాహన పార్కింగ్, గస్తీ పార్టీ ఏర్పాటు చేశామన్నారు. వత్సవలస ప్రాథమిక పాఠశాలలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు.



రాజరాజేశ్వరి దేవి

నాలుగు వారాల జాతర..

గ్రామంలో సుమారు 25 పీఠాలుండగా, ప్రధానంగా ఐదు ప్రధాన పీఠాల వద్ద సంబరాలు జరుగుతుంటాయి. ప్రధానంగా వారానికి ఒక కుటుంబం వద్ద ఉన్న రాజమ్మ తల్లి వద్ద నాలుగు వారాలు పూజలు చేస్తారు. అయితే అన్ని పీఠాల వద్ద భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. అదేవిధంగా భూలోకమ్మ తల్లిని భక్తులు దర్శించుకుంటారు.

వన్‌వే ఏర్పాటు..

వత్సవలస జాతర సందర్భంగా వరుసగా శని, ఆదివారాల్లో శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను శ్రీకూర్మం కూడలి మీదుగా తూలుగు నుంచి వత్సవలస వరకు వన్‌వేను పోలీసులు ఏర్పాటు చేశారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వెళ్లేందుకు వన్‌వే ఉంటుందని పోలీసులు తెలిపారు.

కాంప్లెక్సులో వ్యక్తి మృత్యువాత

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరా ల ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటలకు కాంప్లెక్సు వద్ద హఠాత్తుగా ఓ వ్యక్తి కుప్పకూలడం అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు చూసి ఆర్టీసీ బస్ డిపో మేనేజరుకు సమాచా రం చేరవేశారు. అంతకుముందు వేకువఝామున నాలుగు గంటలకు స్వీపర్లు చూసేటప్పుడు బాగానే ఉన్నాడన్న సమాచారం తెలుసుకున్న డిపో మేనేజరు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మొదట గుర్తు తెలియ ని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టగా.. మృతి చెందిన వ్యక్తి రణస్థలం మండల కేంద్రం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఇలకల రాంబాబు(45)గా గుర్తించారు. ఇతనికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంబాబు కూలి పనులు చేస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నాడని.. ఫిట్స్, ఫైల్స్ వ్యాధి ఉండటంతో చనిపోయివుంటాడని బంధువులు భావిస్తున్నారు.

ఉత్తరాంధ్ర పురావస్తు వాయిద్యాల సేకరణ



సిక్కోలు గిరిజనుల వాయిద్య పరికరాన్ని పరిశీలిస్తున్న జయధీర్ తిరుమలరావు

పలాస: ఉత్తరాంధ్రలో గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టి కనుమరుగవుతున్న ప్రాచీన వస్తువులు, సంగీ త వాయిద్యాలు సేకరిస్తున్నట్లు గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం వ్యవస్థాపక అధ్య క్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. ఆద్య కళ పరిశోధకులు ప్రొఫెసరు జయధీర్ తిరుమలరావు(హైదరాబాద్)తో కలిసి పలాస మండలం ఉద్దానం ప్రాంతంలోని బొడ్డపాడు, రంగోయి, పలాస తదితర ప్రాంతాల్లో ఇటీవల పర్యటించారు. ప్రాచీన ఇత్తడి వస్తువులు, నాణేలు, కత్తులు, రైతులు ఉపయోగించి న గూడ, బుర్ర, గిడుగు, చిన్నపాటి వెదురు బుట్ట లు, జముకు, తుడుం, దీపపు బుడ్లు, సునపకాయ లు, చెక్క బొంగరాలు సేకరించారు. పార్వతీపురం రచయిత జగదీశ్వర రావు ద్వారా గిరిజన వాయిద్యా లైన కిన్నెర, చిన్న కిన్నెర మెట్లను పరిశీలించారు. వీటన్నిటిని హైదరాబాద్ మ్యూజియంలో భద్రపరుస్తామని జయధీర్ తిరుమలరావు చెప్పారు.

కలాసీల ధర్నా

కోటబొమ్మాళి: వేతనాలు పెంచాలంటూ కోటబొమ్మాళి మండలం నారాయణవలసలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో పని చేస్తున్న 80 మంది కలాసీలు గురువారం ధర్నా చేపట్టారు. పక్క గ్రామమైన రాయిపాడు గోదాంలో లారీ నుంచి టన్ను బరువు గల బస్తాలను దించేందుకు రూ.100 చొప్పున అక్కడి కాంట్రాక్టర్ ఇస్తుండగా.. నారాయణవలసలో మాత్రం టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడైన గోదాం కాంట్రాక్టర్ కింజరాపు హరి వరప్రసాద్ టన్నుకు రూ.75 మాత్రమే ఇస్తున్నారని కలాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పనికి వెళ్లకుండా నిరసన వ్యక్తం చేశారు.


25, 26 తేదీల్లో ఇఫ్టూ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 9వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు ప్రకటించారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్‌జీఓ కార్యాలయంలో ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7వ అఖిలభారత ఇఫ్టూ మహాసభలను తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందుగా రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్థిక పారిశ్రామిక విధానాలతో దేశంలోని కార్మిక చట్టాలను పాలకులు నీరుగార్చితే, నేడు మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లతో చట్టబద్ధంగానే కార్మిక చట్టాలకు మరణ శాసనం రాస్తోందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న రాష్ట్రసభలకు 300 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సభలను విజయవంతం చేసేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మామిడి క్రాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, ఏపీటీఎఫ్ ఉభయ తెలుగు రాష్ట్రాల పూర్వాధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఇఫ్టూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతింటి నీలంరాజు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో పోలీసులు

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన పిలక చంద్రయ్య, పుల్లేటికుర్తి మన్మధరావులు ఒడిశా నుంచి తీసుకొచ్చిన నాటుసారా ప్యాకెట్లను గురువారం అమ్మడానికి సిద్ధంగా ఉండగా కంచిలి ఎస్‌ఐ ఎస్. చిరంజీవి, సిబ్బంది పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 65 ప్యాకెట్లు చొప్పున సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా పరిధి సి.సర్దాపూర్ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరలకు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదుచేసి, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ పురోభివృద్ధికి తోడ్పడాలి



అత్యుత్తమ డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న జోనల్ ఈడీ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ అంటే ప్రయాణికుల భద్రతకు భరోసా వంటిదని, అటువంటి సంస్థ పురోభివృద్ధికి అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది తోడ్పాటునందించాలని విజయనగరం జోన్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ అన్నారు. ఆర్టీసీ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం శ్రీకాకుళం రెండవ డిపో గ్యారేజీ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఏకాగ్రతతో రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. సంస్థలో అత్యుత్తమ డ్రైవింగ్ చేసిన అవార్డు గ్రహీతలను మిగతా డ్రైవర్లు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపరవాణాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి సంస్థలో ప్రమాదాల శాతాన్ని తగ్గించేందుకు డ్రైవర్లు కృషిచేయాలన్నారు. డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఆర్.ఎస్.రావు, బి.వి.ఆర్.మూర్తి, పి.వి.రావు, ఎస్.పురుషోత్తం, వై.జి.రావు, డి.వి.రాజు, కె.రమణ, యూ.ఎ.రావు, కె.ఎస్.పి.రావు, కె.జె.రావు, జె.ఎల్.నారాయణ, డి.ఎం.రావు, ఎంకె.సాహు, టి.కె.వి.రావు, యూ.కె.రావులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ గంగాధర్, డీపీటీఓ విజయకుమార్, డీసీఈ కె.శ్రీనివాసరావు, అప్పల నారాయణ, వర్క్స్ మేనేజర్ వరలక్ష్మి, ఏఎంఈ టైర్స్ టి.కవిత, శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో మేనేజర్లు కె.మాధవ్, కెఎస్ఆర్ శర్మ, ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, ఎల్ఎస్ నాయుడు, కె.సుమన్, వి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.